ప్రజాశక్తి
శుక్రవారం 10 మార్చి 2023
5
విజయనగరం

48 గంటల పాటు
మద్యం దుకాణాలు బంద్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డ్రై డేస్ ప్రకటిస్తూ కలెక్టర్ ఎ. సూర్యకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచే మద్యం దుకాణాలను మూసివేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎపి ఎక్సైజ్ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం మార్చి 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 వరకు అనగా పోలింగ్ ముగిసే వరకు ఆయా ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, డిపోలు, కల్లు దుకాణాలు, బార్లు మూసివేయాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకే డ్రై డేస్ ప్రకటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అమరావతి జెఎసి ఇచ్చిన పిలుపుమేరకు ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఉద్యోగుల పరిస్థితి ఏడాదిన్నర కాలంగా అస్తవ్యస్తంగా తయారైందని , తమకు వేతనాలు ఎప్పుడు అందుతాయో, అసలు అందుతాయో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఉద్యోగులు ఆవేదన చెందారు. ఉద్యోగుల రాయితీలు, అలవెన్స్ బకాయిలు అన్ని నిలిచిపోయాయని, చివరకు ఉద్యోగుల హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. క్రింది స్థాయి నుంచి అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తమ వేతనాలు సమస్యను రాష్ట్ర నాయకులు పదేపదే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో తమ నాయకులు ఉద్యమాన్ని చివరి అస్త్రంగా ప్రకటించవలసి వచ్చిందన్నారు. ఈ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల ఉద్యోగులు మద్దతు ప్రకటించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎపి ఐక్య కార్యాచరణ సమితి సలహాదారు డిజి ప్రసాద్, ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి పట్నాల పద్మనాభం, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్కె ఈశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు, రమణరాజు, జిల్లా డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, ఆర్టీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎర్రంనాయుడు తదితరులు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఆయన, భోజన విరామ సమయంలో సహోద్యోగులతో కలిసి నిరసనలు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో పాలకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంతో పాటు తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. సాలూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు.

కోరెడ్ల రమాప్రభను గెలిపించాలి

విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని విశాఖ ఉక్కు పట్టభద్రులకు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన విభాగం వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజాతంత్రవాదులను మండలికి పంపిస్తే పేద, మధ్యతరగతి గొంతును, కార్మిక వాణిని వినిపిస్తారని చెప్పారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో భాగస్వామ్యమైన రమాప్రభ గెలుపు ఉద్యమం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, నిరంతరమూ ప్రజా సేవ చేస్తున్న రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉక్కు కార్మికులను అభ్యర్థించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, రమాప్రభ గెలుపంటే విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి మద్దతు ఇవ్వడమేనని పేర్కొన్నారు. ఎఐసిటియు ప్రధాన కార్యదర్శి చిత్రాల సన్యాసిరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కులో ఉన్న పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి ఉద్యమాలకు మద్దతు పలుకుతున్న రమాప్రభను గెలిపించి శాసనమండలికి పంపించాలని కోరారు. ఈ ప్రచారంలో డివిఆర్ఎస్ఇయు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, డిఐటియు నాయకులు సురేష్ కుమార్, సిపిఐ నాయకులు టి.కనకరాజు, ఎఐటియుసి నాయకులు రామకృష్ణ, రాజబాబు, సిఐటియు నాయకులు వైటి.దాస్, ఎం.రామారావు, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, బి.అప్పారావు, నీలకంఠరావు, కెఎం శ్రీనివాసరావు, యూజ్ నాయకులు కామేశ్వరరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో లాయర్లను, ఉద్యోగులను, సిబ్బందిని డాక్టర్ రమాప్రభ కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

ఉక్కు కార్మిక సంఘాల నేతలతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

రమాప్రభకు మద్దతుగా ప్రచారం చేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

కోరెడ్ల రమాప్రభకు ఓటేయండి

కొత్తవలస : పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ కోరారు. గురువారం కొత్తవలస మండలంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలను సందర్శించి రమాప్రభకు ఓటు వేయాలని కోరారు. రమాప్రభకు ఓటు వేస్తే ప్రయోజనాలు గూర్చి, ఆమె పోరాట స్ఫూర్తి గూర్చి వివరించారు. గత 16 ఏళ్లుగా శాసనమండలిలో, వెలుపల ఉద్యోగ, ఉపాధ్యాయ, కర్షక, కార్మిక, విద్యార్థి, యువత సమస్యలపై పోరాడుతున్నది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికుల జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, ఈశ్వరరావు, గుడివాడ పైడిరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను గుర్తించేందుకు బిఎల్ఒల సేవలు

ఎన్నికల విధులలో తుది నిర్ణయం పిఒలదే ● జోనల్ అధికారుల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ రోజున ఓటర్లను గుర్తించడంలో బిఎల్ఒల సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అందుకు సంబంధించి తహాశీల్దార్లకు ఇప్పటికే సర్క్యులర్ జారీ చేసామని తెలిపారు. ఛాలెంజ్ ఓట్లు , ఓటర్లను గుర్తించడానికి , ఓటింగ్ ప్రశాంతంగా జరగడానికి వీరి సేవలను వినియోగించాలన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా జోనల్ అధికారులకు, పిఒలకు గురు వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ బాధ్యత మొత్తం పిఒపైనే ఉంటుందని స్పష్టం చేసారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రవేశానికి , బయటకు వెళ్లేందుకు వేర్వేరుగా మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కువగా ఓటర్లు ఉన్న చోట మహిళలకు, పురుషులకు వేర్వేరుగా క్యూ లైన్లను ఏర్పాటు చేయాలన్నారు. క్యూ లైన్ల వద్ద నీడతో పాటు , తాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల ఏజెంట్‌లకు పోలింగ్ బూత్ వద్ద ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు బూత్‌లోకి మొబైల్ ఫోన్‌లు, కెమెరాలు తీసుకు వెళ్లకూడదని స్పష్టం చేసారు. విఐపిలు ఓటింగ్ కు వచ్చేటప్పుడు వారి సెక్యూరిటీలు, పిఎలను కూడా లోపలికి అనుమతించరాదని, ఒక్క ఓటరు మాత్రమే వెళ్లాలని అన్నారు.

సాయంత్రం 4 గంటలతో ఓటింగ్ ముగించాలని, 4 గంటలకు క్యూ లో నున్న ఓటర్లకు చిట్టీ లు ఇవ్వాలని తెలిపారు. వెయ్యి దాటి ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజున కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు పోల్ సమాచారాన్ని ప్రతి గంటకు అందించాల్సి ఉంటుందని అన్నారు. ఎన్నికల విధులలో నున్న అధికారులంతా పోస్టల్ బాలట్ కోసం దరఖాస్తు చేసుకొని, వారి ఓటును వినియో గించుకోవాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ గణపతి రావు, డిప్యూటీ కలెక్టర్ పద్మలత, జోనల్ అధికారులు, పిఒ లు పాల్గొన్నారు.

13న ప్రత్యేక సాధారణ సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేసేందుకు వీలుగా ఈ నెల 13న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

ఈ నెల 12, 13 తేదీలలో పోలింగ్ స్టేషన్ల పరిధిలో లోకల్ హాలిడే ప్రకటించినట్లు వెల్లడించారు. జిల్లాలో పోలింగ్ జరుగుతున్న 72 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఈ సెలవు వర్తిస్తుందని తెలిపారు. మిగిలిన కార్యాలయాల విధులు యథావిధిగా కొనసాగుతాయని వివరించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

● సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ
● పలు చోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి-కొత్తవలస

ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం వేధింపులు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం కొత్తవలస పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు నష్టం కలిగించే సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ విధానాలు ఉద్యోగులను ఊపిరి ఆడకుండా చేస్తున్నాయని, రోజురోజుకూ నిర్బంధాలు, అణచివేత చర్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వారిపై ముప్పేట దాడి చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు మద్దతుగా ఆందోళనలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపకుంటే ప్రభుత్వానికి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు, ప్రజలు

అక్కివరం-గంట్లాం రహదారిపై..

డెంకాడ : ఉద్యోగులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిపిఎం నాయకులు బి.సూర్యనారాయణ అన్నారు. గురువారం అక్కివరం, గంట్లాం రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులపై వేధింపులు ఆపాలని, సిపియస్ రద్దు చేయాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకుల ఎన్.సూర్యనారాయణ, బి.నరిసినాయుడు, జి.పెంటరాజు. కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు రెడ్డివేణు, మన్మధరావు, తదితరులు మాట్లాడారు.

ఫ్లూ పట్ల జాగ్రత్తలు అవసరం

డిఎంహెచ్ఒ రమణకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో ఫ్లూకేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి తెలిపారు. తాజా కేసులకు చాలా వరకు ఇన్‌ఫ్లుయెంజా-ఎ-ఉప రకం 'హెచ్3ఎన్2' వైరస్ కారణమని గుర్తించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) తెలిపిందని పేర్కొన్నారు. ఇతర ఉపరకాలతో పోలిస్తే ఈ వైరస్ ప్రభావం ఎక్కువని, దీంతో ఆస్పత్రుల్లో చేరికలు పెరుగుతున్నాయని పేర్కొంది. సాధారణ జ్వరంతో పాటు నిరంతరం దగ్గు రావడం, కొందరిలో శ్వాస కోశ సమస్యలు ముఖ్య లక్షణాలుగా తెలిపారు. వైరల్ జ్వరాలు ఎక్కువ శాతం పిల్లల ద్వారా కుటుంబంలోని అందరికీ ఈ లక్షణాలు వ్యాప్తి చెందుతున్నాయని వైద్య నిపుణులు తెలియచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సూచించిందని తెలిపారు. ఈ ఇన్ఫెక్షన్ సాధారణంగా ఐదు నుంచి ఏడు రోజుల్లోపే తగ్గిపోతుందని, సీజనల్ జ్వరాలు మూడు రోజుల్లోనే తగ్గితే.. దగ్గు మాత్రం మూడు వారాల వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫ్లూ బారిన పడిన రోగులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. తుమ్మినపుడు, దగ్గినపుడు ముఖానికి చేతి రుమాలు అడ్డు పెట్టుకొనవలేను. చేతులను క్రమం తప్పకుండా సబ్బుతో కడగాలని, లక్షణాలు ఉన్నవారు మాస్కులు ధరించాలని, వీలైనంత ఎక్కువగా ద్రవ పదార్థాలను తాగాలని, జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటే పారాసెట్‌మాల్ తీసుకోవాలని సూచించారు.

పింఛనర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అపరిష్కృతంగా పింఛనుదారుల సమస్యలను పరిష్కరించాలని గురువారం రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దింటి అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2018 జులై నుంచి బకాయి ఉన్న డిఆర్, ఎరియర్లు వెంటనే చెల్లించాలన్నారు. పిఆర్‌సి ఎరియర్లు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. 11వ పిఆర్‌సిలో ఉన్న పలు అసంబద్ధతల సవరణలకు కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే 12వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదిన పింఛను జమ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులపై క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అన్ని ఆస్పత్రుల్లో అన్ని వ్యాధులకు అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

కలెక్టర్‌కు వినతి అందించేందుకు వచ్చిన పింఛనుదారులు

జిల్లాకు మంత్రి బొత్స రాక

విజయనగరం : విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం గజపతినగరం, మధ్యాహ్నం శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఏర్పాటయ్యే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఉత్తరాంధ్ర పార్టీ కమిటీ నియామకం

విజయనగరం : ఉత్తరాంధ్ర పార్టీ సెంట్రల్ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వర్కింగ్ కమిటీ సభ్యులు పేడాడ జనార్ధనరావు తెలిపారు. అధ్యక్షులుగా మెట్ట రామారావు, ఉపాధ్యక్షులుగా బి.సూరజ్‌కుమార్, కోశాధికారిగా పి.శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శిగా కె.రామారావు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా పేడాడ జనార్ధన్‌రావు నియమితులయ్యారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి వెంకట సుబ్బయ్య, తదితరులు

జెఎన్‌టియులో సాంకేతిక విద్యాసదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో జరుగుతున్న రెండు రోజుల జాతీయ సాంకేతిక సదస్సును వైస్ ఛాన్సలర్ వెంకట్ సుబ్బయ్య గురువారం ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రతి సంవత్సరం విడుదల చేసే మ్యాగజన్‌ను ఈసందర్భంగా ఆయన ఆవిష్కరించారు. ఇతర విభాగంలో ఉన్న ముఖ్య మైన కోర్సులపై అవగాహన పెంచుకోవాలని, విద్యార్థులకు వచ్చిన సృజనాత్మక ఆలోచనలను పుస్తక రూపంలో తీసుకువచ్చే కాపీరైట్స్ ప్రాముఖ్యతను వివరిం చారు. విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికగా ఉపయోగ తుందని అన్నారు. సీనియర్ రీజనల్ మేనేజర్ డాక్టర్ విజయకుమార్ సాహు తృతీయ సంవత్సరం విద్యార్థి వై.సాయి ఆతిద్య రచించిన పుస్తకం ' హ్యూమన్స్ ఆరీ డేంజర్స్ జోన్' ను ఆవిష్కరించారు. ఫ్యాకల్టీ కోర్డినేటర్ డిఆర్‌డివి శివరాం మాట్లాడుతూ 234 మంది సాంకేతిక సదస్సులో వారి పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, సైన్సు విభాగాధిపతి పి.అటన్‌కమార్, ఆర్‌డిడివి శివరామ్, స్టూడెంట్ కోఆర్డినేటర్ తేజశ్వని తదితరులు పాల్గొన్నారు.

సీతాకుమారికి బెస్ట్ ఉమెన్ ప్రాజెక్టు ప్లానర్ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం

మహారాజా కాలేజి ఆఫ్ ఫార్మసీలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.సీతాకుమారికి విజయవాడలోని విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ బెస్ట్ ఉమెన్ ప్రాజెక్టు ప్లానర్ అవార్డు అందజేసింది. ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ఫోరం ఈ ఏడాది నిర్వహించిన 'ఎక్స్‌పీరిన్సియల్ లెర్నింగ్ త్రో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్'లో సీతాకుమారి జోన్-1 జిల్లాల్లో ప్రథమ స్థానం సాధించారు. దీంతో 8 జోన్ల పరిధిలో విజయవాడ విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె బెస్ట్ ప్లానర్ అవార్డుతో పాటు నగదు బహుమతిని కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.ఉదయ్‌శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులు అభినందించారు.

అవార్డు అందుకుంటున్న అధ్యాపకులు సీతాకుమారి

16 నుంచి నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు శ్రీ నూకాలమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నామని శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ యువజన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, యడ్ల రాజేష్ తెలిపారు. గురువారం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో జాతరకు సంబంధించిన కరపత్రాలను, ఆహ్వాన పత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం మంగళవీధి, పాత పశువుల మార్కెట్ ఆవరణలో శ్రీశ్రీశ్రీ నూకాలమ్మవారి 65వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 15న బుధవారం సాయంత్రం నూకాలమ్మవారికి పాలాభిషేకం నిర్వహించిను ఉత్సవాలను నిర్వహిస్తామన్నరు. ప్రతీ రోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 21న అమ్మవారి చల్లదనం మహోత్సవం, అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వజ్రపు నవీన్ కుమార్, యడ్ల భాస్కరరావు, రొంగలి శరత్‌బాబు, రాజేంద్రప్రసాద్, మజ్జి అప్పారావు, వెంపడాపు వెంకటరావు, మండల శ్రీనివాసరావు, పతివాడ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సౌత్ ఇండియా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జిల్లాకు చెందిన కోరాడ శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఉన్న శ్రీనివాసరావు సౌత్ ఇండియా బాడీ బిల్డర్స్ అసోసియేషన్‌కు ఎంపిక కావడం పట్ల జిల్లా అధ్యక్షులు రెడ్డి శంకరరావు, కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.



చట్ట ప్రకారమే
ఇనాం భూములకు పట్టాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొర్లవలస గ్రామంలో ఎన్నో ఏళ్ల నాటి ఇనాం భూములు సాగు చేస్తున్న రైతులకు చట్ట ప్రకారం పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహాశీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి తెలిపారు. గురువారం కొర్లవలస గ్రామ ఇనాం భూముల రైతులతో పట్టాల పంపిణీకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. భూ హక్కులో ఉన్న రైతులతో పట్టాల కోసం చర్చించారు. గ్రామంలో 2010 సర్వే ప్రకారం 826.74 ఎకరాలలో 611 మంది రైతులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ భూములకు ఎంజాయ్ మెంట్, భూసర్వే పూర్తయిందన్నారు. సర్వే అనంతరం చట్ట ప్రకారం నోటీసులు రైతుల పేరిట జారీ చేసి వాటి మీద అభ్యంతరాల నివేదికను ఉన్నతా అధికారులకు నివేదిస్తామన్నారు. ఆర్‌డిఒ ఆదేశాల మేరకు పట్టాలు పంపిణీకి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని అన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

సావిత్రిబాయి

నిమ్నవర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి కృషి

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిమ్న వర్గాల అభ్యున్నతికి విశేషం కృషి చేసిన మహనీయురాలు సావిత్రి భాయి పూలే అని తెలుగు భాష సేవా సంఘం అధ్యక్షులు ఆర్.బి.రామానాయుడు కొనియాడారు. గురువారం స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో సావిత్రి భాయి పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విజయ స్వరం సుధ వ్యవస్థాపకులు డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సావిత్రి భాయి పూలే ఏక పాత్ర అభినయం పోటీలను నిర్వహించారు. పి.లావణ్య (5వ తరగతి) ప్రథమ స్థానం, కె.యామిని (5వ తరగతి) ద్వితీయ స్థానం, ఎల్.వసంతలక్ష్మీ (5వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి సావిత్రి భాయి పూలే జీవిత చరిత్ర పుస్తకాలను పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు చేతులు మీదుగా అందజేశారు.

15 నుంచి అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈ నెల 15,16,17 తేదీల్లో అగ్రిగోల్డ్ బాధితులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహారదీక్షలు, సత్యాగ్రహ కార్యక్రమాల నిర్వహణకు అగ్రిగోల్డ్ బాధితులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవి నాయుడు కోరారు. గురువారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తుల విక్రయానికి సత్వరమే ప్రభుత్వం ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కార్యదర్శి సాలాపు అనంతరావు పాల్గొన్నారు.

ఐతమ్ కాలేజ్ ఫెస్ట్‌లో సత్తాచాటిన సాయి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల(ఐతమ్)లో నిర్వహించిన ఫెస్ట్‌లో సివిల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న పాలకొండకు చెందిన సూరంభట్ల సాయిదీపక్ ప్రతిభ కనబర్చారు. సింగన్నవలస గ్రామానికి చెందిన సాయి దీపక్ భూకంపాలు నుంచి రక్షణ నిర్మాణాలపై ప్రయోగాన్ని వివరించారు. భూకంపాలు వచ్చే సమయంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలి, వాటి నుంచి ఎలా రక్షణ పొందాలన్న అంశాలను కులంకుశంగా వివరించారు. ఫెస్ట్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో సాయిదీపక్‌కు ప్రయోగం అందరినీ ఆకర్షించింది. సాయిదీపక్ ప్రజెంటేషన్‌కు హెచ్ఒడి పి.దినకర్‌తో పాటు పలువురు అధ్యాపకులు అభినందించారు. పాలకొండ ప్రాంతానికి చెందిన సాయిదీపక్ మంచి ప్రయోగాన్ని చూపించి అందరి మన్ననలు పొందడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా స్నేహ సంస్థ వార్షికోత్సవం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్నేహ స్వచ్ఛంద సంస్థ 12వ వార్షికోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు ఎస్ వెంకటరావు అధ్యక్షత వహించారు. వివిధ శాఖల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు మహిళా దినోత్సవం సందర్భంగా కొత్తం పిహెచ్‌సి వైద్యులు జి.లావణ్య సన్మానించారు. స్నేహ ప్రతిభ పరీక్షలో సత్తాచాటిన పదో తరగతి విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి మంథా సుబ్బారావు, కోశాధికారి గణేష్, సభ్యులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ త్రినాధరావు, ఎంఎస్ ఎస్ మూర్తి, మల్లా రామకృష్ణ, బి.భాస్కరరావు, వి.మురళి, రమేష్, ప్రకాశ్ పాల్గొన్నారు.

వేపాడలో ర్యాలీ చేపడుతున్న అధికారులు, సచివాలయ సిబ్బంది, మహిళలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మహిళలకు రక్షణ కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి బి.వాసుదేవన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య జోసెఫ్, తహశీల్దార్ పి.రాజారావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం మున్సిపల్, పట్టణ ఐసిడిఎస్, రెవెన్యూ, మండల పరిషత్, లీగల్, రూరల్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించి, మానవహారం చేపట్టారు. మహిళా హక్కులను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్న మహిళా పోలీసులను రోటరీ క్లబ్ ఘనంగా సత్కరించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొబ్బిలి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మంగమ్మతోపాటు మరో ఏడుగురిని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు, ప్రతినిధులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, జ్ఞాన ప్రసాద్ సత్కరించి, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో రోటరీ కోశాధికారి శ్రీనివాసన్, సర్వీస్ ప్రాజెక్ట్ ఛైర్ గెంబలి శ్రీనివాసరావు, రామకృష్ణ, శంకరరావు, డేవిడ్ జె విక్టర్ పాల్గొన్నారు.

వేపాడ : వేపాడలో మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజెకెవి పట్నాయక్, వైకెపి ఎపిఎం ఆర్.సూర్యనారాయణ, ఎపిఒ సన్యాసినాయుడు, పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కామేశ్వరి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బొండపల్లి: బొండపల్లి ఉన్నత పాఠశాలలో ఎంపిడిఒ వేదవతి అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు అందరిని ఆలోచింపజేశాయి. విశేష ప్రతిభ కనబరిచిన ఎపిఎం సులోచనదేవి, ఎఎన్ఎం కె అనూరాధ, పంచాయతీ కార్యదర్శి సత్యవతి, నారాయణ, అంగన్వాడీలు కె.విజయ, సత్యవతి, ఇందుమతి, తదితరులకు మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస మిశ్రా, ఇఒపిఆర్‌డి సుగుణాకరరావు, హెచ్ఎం సన్యాసిరాజు, ఎపిఒ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

వంగర : మహిళా దినోత్సవాన్ని స్థానిక మండల కేంద్రంలో అధికారులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు, తహశీల్దార్ డి.ఐజాక్ డిటి సుందర రావు, ఎపిఎం చక్రపాణి, ఇఒపిఆర్‌డి త్రినాధరావు, వంగర జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం యు.రమణమ్మ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.భగవతి, కిషోర్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

డెంకాడ: ఎంవిజిఆర్ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌పి దీపిక పాటిల్ పాల్గొని ప్రసంగించారు. ఇందులో భాగంగా డిజిటల్ వ్యాస రచన, సైబర్ అవగాహనపై టెడ్ టాక్, పోస్టర్ ప్రదర్శన వంటి ఈవెంట్లలో విజేతలందరికీ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, మహిళా సాధికారత జెఎన్‌టియు జివి, క్రాంతి వలత్, ఎంవిజిఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎల్ రాజు, స్టూడెంట్ డీన్ ఎస్ మోహన్ కుమార్, డబ్ల్యుఇసి కన్వీనర్ డాక్టర్ ఎం. సారా కమలా కుమారి, విద్యార్థి ప్రెసిడెంట్ ఇందు జాహ్నవి, విద్యార్థులు పాల్గొన్నారు.

డ

భోగాపురం: బాల్య వివాహాలను నివారించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి. పద్మావతి అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా భోగాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి. బంగారయ్య, ఎపిఎం రమణ, ఎపిఒ ఆదిబాబు, ఐసిడిఎస్ ఎపిడి తవిటి నాయుడు, సూపర్‌వైజర్లు నాగమణి, శాంతిలత, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్ల: స్థానిక కెజిబివి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా నీరు, పారిశుధ్య విభాగం సహకారంతో డిపిఎంయు ఆధ్వర్యంలో వ్యాసరచన , డ్రాయింగ్, ముగ్గులు, జలజీవన్ మిషన్ లోగో పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆర్‌డబ్ల్యుఎస్ కార్యనిర్వాహక ఇంజనీరు ఎవిఎస్ రాజన్, డిఇలు వై. గోవిందరావు, కవిత చేతలు మీదగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఒ కల్యాణి, ఎఇ పార్వతీ, డిపిఎంయు జిల్లా కోఆర్డినేటర్ రాఘరావు, విజయబాబు, ప్రిన్సిపల్ జానికీ దేవి తదితరులు పాల్గొన్నారు.

గుర్ల..

బొబ్బిలి..

కిడ్నీని కాపాడుకోవాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్‌డి తిరుమలప్రసాద్, వైద్యులు శ్రీకాంత్, శివకుమార్ తదితరులు

తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి తిరుమలప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం

మనిషికి గుండె, మెదడు ఎంత ముఖ్యమో కిడ్నీకూడా అంతే ముఖ్యమని, దాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరమని తిరుమల -మెడికవర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ అన్నారు. కిడ్నీడే సందర్భంగా గురువారం ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీలో వచ్చిన చిన్న చిన్న సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదిస్తే పరిష్కారమవుతాయని తెలిపారు. 50 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కిడ్నీడే సందర్భంగా ఈనెల 31వరకు తమ ఆస్పత్రిలో ప్రత్యేక కిడ్నీ చెకప్ ప్యాకేజీ సుమారు రూ.4వేలు విలువగల పరీక్షలు కేవలం రూ.699కే చేయనున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ జె.శ్రీకాంత్ మాట్లాడుతూ కిడ్నీలో రాళ్లు చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడి, ఆహారపు అలవాట్లు వల్ల కూడా కిడ్నీలో రాళ్లు తయారవుతున్నాయన్నారు. అయితే ప్రస్తుతం వచ్చిన టెక్నాలజీతో వాటిని సులువుగా సర్జరీ ద్వారా తొలగించవచ్చునన్నారు.

పముఖ నెఫ్రాలజిస్టు డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ కిడ్నీ పనితీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నేడు యువతలో కూడా కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయన్నారు. జనరల్ ఫిజీషియన్ కెటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అధిక రక్తపోటు, డయాబిటీస్‌వల్ల కిడ్నీ వ్యాధులు రావచ్చునన్నారు. తరచూ ఆరోగ్య తనిఖీలు నిర్వహించుకోవడం ద్వారా వ్యాధిని సకాలంలో గుర్తించి నయం చేసుకోవచ్చునని తెలిపారు. సమావేశంలో తిరుమల మెడికవర్ ఆస్పత్రి సెంట్రల్ హెడ్ విఎన్ పద్మకుమార్, ఎఒ పివి నారాయణ పాల్గొన్నారు.

యుబి గొట్లాం బ్రాంచ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-బొండపల్లి

యూనియన్ బ్యాంకు గొట్లాం బ్రాంచ్ సేవలు అభినందనీయమని యుబి జనరల్ మేనేజర్ కెఎస్‌డిఎస్ వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గొట్లాం గాయత్రి కళాశాలలో బ్యాంకు సేవలపై విద్యార్థులకు, సర్పంచులకు, ఎంపిటిసి సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సేవలందించడంలో గొట్లాం బ్రాంచ్ ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొంటూ బ్రాంచ్ మేనేజర్ పిఎస్ మల్లేశ్వరరావును అభినందించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న పథకాలు, రుణాలు, తదితర సేవలను వివరించారు. గాయత్రి విద్యాసంస్థల డైరెక్టర్ ఎరుకునాయుడు మాట్లాడుతూ చదువు కోసం యూనియన్ బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుబి రీజనల్ మేనేజర్ బికెవిఎస్ఎస్ గురునాథరావు, చీఫ్ మేనేజర్లు మాధురి, శ్రీనివాసరావు, సర్పంచులు మీసాల తులసీరావు, కర్రోతు శ్రీనివాసరావు, లండ నారాయణమ్మ, బొద్దల చిన్నంనాయుడు, గొట్లాం పిఎసిఎస్ అధ్యక్షులు మహంతి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐ బ్రాంచ్ ముందు నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బిజెపి విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - భోగాపురం

బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పుకొట్టాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ అన్నారు. గురువారం భోగాపురం మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలతో దేశం ఎంతో వెనుకబడిపోతుందని, ప్రభుత్వ రంగ సంస్థలపై బిజెపి కన్ను పడిందని ఎల్ఐసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇతర జాతీయ బ్యాంకుల బలవంతుపు పెట్టుబడులపై కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. సూరిబాబు, శ్రీను తదితరుల పాల్గొన్నారు.

పోటీల్లో

ముగిసిన ముత్యాలమ్మ తీర్థం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో మూడు రోజులపాటు నిర్వహించిన ముత్యాలమ్మ తీర్థం గురువారం ముగిసింది. అమ్మవారి విగ్రహాన్ని టిడిపి నియోజకవర్గ నాయకులు గొంప కృష్ణ దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, నాయకులు సేనాపతి గణేష్, సిరికి రమణ పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఏర్పాటుచేసిన ఎడ్ల పరుగు పోటీలు రసవత్తరంగా సాగాయి. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు నగదు బహుమతులను ఉత్సవ కమిటీ సభ్యులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మహిళా కోలాటం, బుర్రకథ ఆకట్టుకున్నాయి.

పైపులైన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని బలిజిపేట రోడ్డులో నూతన పైపులైన్ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కాంట్రాక్టర్‌కు సూచించారు. పైపులైన్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు వేగవంతం చేసి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. లీకులకు ఆస్కారం లేకుండా పనులు చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీటి అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

పైపులైను

స్పందించారు.. ఫ్లెక్సీ తొలగించారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం వద్ద సిఎం జగన్ ఫ్లెక్సీని గురువారం తొలగించారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న నేపథ్యంలో వెల్‌నెస్ కేంద్రం వద్ద సిఎం ఫెక్సీని తొలగించకపోవడంపై 'ఎన్నికల కోడ్ వర్తించదా..?' అనే శీర్షికతో గురువారం 'ప్రజాశక్తి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి, వెంటనే తొలగించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని గడబవలస గ్రామంలో బొత్స గౌరమ్మ పేరంటాలు గుడి ప్రతిష్ట గురువారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవంలో మాజీ ఎంపి బొత్స ఝాన్సీ లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ జరిగిన తప్పెటగుళ్లు, నృత్యాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మీసాల విశ్వేశ్వరరావు, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి గుడివాడ శ్రీరాములునాయుడు, సొసైటీ ప్రెసిడెంట్లు లెంక శ్రీరాములు, యలకళ అప్పలనాయుడు, సర్పంచ్ యల్లాంటి లక్ష్మి, వైసిపి నాయకుడు యల్లాంటి సత్యనారాయణ, ఎంపిటిసి పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

పొగతాగే వారికి అవగాహన కల్పిద్దాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్‌క్లబ్ నడక మైదానంలో గురువారం అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని (నో స్మోకింగ్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎస్. ప్రకాశరావు, క్లబ్ అధ్యక్షుడు సిహెచ్ రమణ మాట్లాడుతూ పొగతాగటం ఆరోగ్యానికి హానికరమని, ఎక్కువశాతం క్యాన్సర్ బారిన పడుతున్నారని, పొగతాగే వారికన్నా పొగపీల్చే వారు ఎక్కువశాతం అనారోగ్యపాలు అవుతున్నారని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోనై, ధూమపానం, మద్యపానం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు లోనై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారని వాపోయారు. అందరూ సన్మార్గంలో నడిచి,మంచి పుస్తకాలు చదివి,అందరూ సరియైన ఆహార నియమాలను పాటిస్తూ నడవటం, వ్యాయామం చేయాలని అన్నారు. ధూమపానం చేసేవారికి మాన్పిద్దామని ప్రతిజ్ఞ చేసి, పొగత్రాగటం ఆరోగ్యానికి హానికరమని ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు వై.నలమారాజు, జాలీ వాకర్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సౌకర్యం

ప్రజాశక్తి-జామి

ఆస్పత్రికి తనిఖీల నిమిత్తం వస్తున్న గర్భిణులకు, వారి సహాయకులకు, వైద్య సిబ్బందికి దాతలు ప్రతి నెలా భోజన సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందదాయకమని పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్.భాగ్యరేఖ అన్నారు. గురువారం పిహెచ్‌సిలో గర్భిణులకు విశ్రాంత ఎస్ఐ రంపా చిట్టిబాబు జ్ఞాపకార్థం ఆయన సతీమణి రంప శ్యామల, కుమారుడు, కృష్ణ క్లాత్‌స్టోర్ యజమాని రంపా రామాలు భోజనాన్ని అందించారు. దాదాపు 100 మందికి పైగా భోజనాలు చేసి దాతలను వైద్యాధికారి అభినందించారు. కార్యక్రమంలో నార్ల మహంతి నారాయణరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విన్నకోట నానాజీ, కిషోర్, మానాపురం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాసరి పవన్ కుమార్ (20) అనే విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు రోడ్డు పక్కన ఉన్న పవన్‌కుమార్‌ను పాలకొండ నుంచి వీరఘట్టం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాల పాలైన విద్యార్థిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పవన్‌కుమార్ పట్టణంలో గాయత్రీ ఒకేషన్ డిగ్రీ చదువుతున్నాడు. వవన్ స్వగ్రామం సంతకవిటి మండలం కృష్ణయ్యవలస. ఎస్ఐ శివప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేల బావిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని ఎస్ఎస్ఆర్‌పేట గ్రామానికి చెందిన గుంటామని రాము భార్య ఉమ నేలబావిలో పడి మృతి చెందారు. బుధవారం రాత్రి నుండి ఉమ కనిపించడం లేదని రాము డెంకాడ మండలంలోని పినతాడివాడలోని తన అత్తవారికి ఫోన్ చేశారు. వెంటనే మృతిరాలి తమ్ముడు ఎస్-ఎస్ఆర్ పేటకు చేరుకుని సమీపంలో ఉన్న తోటలు, గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతికారు. గ్రామ శివారులో ఉన్న ఒక బావిలో మహిళ మృత దేహాన్ని గ్రామస్తులు చూసి సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి వెళ్లి అది తన అక్క ఉమ మృత దేహంగా గుర్తించాడు. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నట్లు ఉమ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.శిరీష కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని చుక్క పేట జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నెల్లిమర్లకు చెందిన సిల్ల సోమశేఖర్ అలియాస్ సందీప్ తన స్నేహితులతో కలసి గరివిడి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో గుర్ల మండలం చుక్క పేట సమీపంలో ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పి పడిపోవడంతో సందీప్ అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో పాలూరి గణేష్, సాయికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలంలో

కుక్కల దాడిలో మరో జింక మృతి

సీతానగరం : మండలంలో గత ఆదివారం కుక్కల దారిలో కృష్ణలంక మృతి చెందిన సంఘటన మరకముందే మరో జింకను కుక్కలు పొట్టను పెట్టుకున్నాయి. పార్వతీపురం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.మనోజ్ ఇచ్చిన వివరాలిలా ఉన్నాయి. ఎండలు తీవ్రం కావడంతో నీటి కోసం కొండపై నుంచి జోగంపేట హాస్టల్ వద్దకు జింకలు వస్తున్నాయన్నారు. ఇదే సమయం లో కుక్కలకు దాడి చేయడంతో జింక మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ రామారావు జింకకు శవ పంచనామా నిర్వహించి ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో ఖననం చేయడం జరిగింది.

11న వాహనాల వేలం

ప్రజాశక్తి- జియ్యమ్మవలస

నాటు సారతో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఆటో ఈనెల 11వ తేదీన వేలం వేయనున్నట్లు చినమేరంగి ఎస్ఐ జి. కళాధర్ తెలిపారు. 14 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పాలకొండ డిఎస్‌పి ఆధ్వర్యంలో వేలం వేస్తామని ఆసక్తి కలవారు వేలంపాటలో పాల్గొని రూ. 1000 కాషన్ డిపాజిట్ చెల్లించాలని అన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 7/2022
Between:
Talasila Rohini Kumar ...Petitioner
And:
Y. Venkateswara Rao & others ...Respondents
NOTICE
To,
Respondent No.18:
P. Satish Kumar, S/o. Mohan Rao, age 38 years, Private Employee, # 8-24-36, Srinagar, Thotapalem, Vizianagaram-535003.
Please take notice that the above named petitioner has instituted the above I.P against the respondents and the matter stands posted to **15-03-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **15-03-2023 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
YERRA REVATHI, Advocate
Visakhapatnam. **Cell: 79893 44376**

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం జూనియర్ సివిల్ జడ్జి స్పెషల్ మొబైల్ కోర్టు వార్కి
O.S. 298/2022
Between:-
రుంకాన రాజినాయుడు ......వాది
And:-
నల్లి ప్రకాశరావు .....ప్రతివాది
ప్రతివాది :
నల్లి ప్రకాశరావు, S/o లేటు అప్పల సూర్యనారాయణ @ సూరిబాబు, జర్జాపుపేట గ్రామము, నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా.
పై దావాలో వాది ప్రతివాది పైన ప్రాంసరీ నోటు బాకీ రాబట్టే నిమిత్తం శ్రీ కోర్టువారి ముందు దావా దాఖలు చేయగా యిందలి ప్రతివాదికి ఎన్ని పర్యాయంములు కోర్టుమూలంగా నోటీసులు పంపించినన్నూ అమలు కానందున **తేది:16-03-2023న ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని, అడ్వకేటు ద్వారాగాని హాజరు కావలెనని శ్రీ కోర్టువారి ఆదేశం లేనిచో పరోక్షంగా తీర్మాణించబడును.
శ్రీ కంటుభుక్త శ్రీనివాసరావు
అడ్వకేటు,
నెల్లిమర్ల, విజయనగరం,
సెల్ : 9440282934